క్లుప్తంగా

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి



మదనాపురం: మండలంలోని బౌసింగ్‌తండాలో 10 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేసిన కిరణ్‌కుమార్ బదిలీపై వెళ్లడంతో గురువారం తండావాసులు ఆయనను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు బోధించిన పాఠాలను నెమరు వేసుకున్నారు. అందరితో కలిసిమెలిసి ఆప్యాయంగా పనిచేశానని కొనియాడారు. కార్యక్రమంలో సీతారాంనాయక్, రమేష్ నాయక్, రవి నాయక్, కిషన్ నాయక్, రమేష్ నాయక్, తండావాసులు పాల్గొన్నారు.

పాఠశాలలో ముగ్గుల పోటీలు



వనపర్తి రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గురువారం మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు రవి ఇంగ్లిష్ గ్రామర్‌తో విద్యార్థులతో ముగ్గులు వేయించి ప్రతిభను చాటారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ డీసీబీ సెక్రెటరీ ఎస్ చంద్రశేఖర్, ఏఎంఓ మహనంది, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు గిరిరాజాచారి, రుద్రమదేవి, మహమ్మద్‌షఫీ, గోపాల్, స్వరూప పాల్గొన్నారు.

విద్యా ప్రదాత ఫాతిమాషేక్

వనపర్తి టౌన్: వందేళ్ల క్రితమే అమ్మాయిలకు అక్షర జ్ఞానం అవసరమని ఆలోచించి ముందుకు సాగిన సామాజిక సంఘ సంస్కర్త ఫాతిమాషేక్ అని ప్రజావాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ కొనియాడారు. ఫాతిమా షేక్ జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలో మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకంటి నర్సింహాశర్మ, రమేష్‌చారి, బాలరాజు, నాగరాజు, సత్యంచారి, మాధవాచారి, వెంకటస్వామి శెట్టి, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పలకల పంపిణీ



అమరచింత: మండల కేంద్రంలోని బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులకు గురువారం దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో పలకలు పంపిణీ చేశారు. దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సేవా సమితి అధ్యక్షుడు కలాంపాషా తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి

ఆత్మకూర్: ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి) సందర్భంగా పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల దర్శనార్థం భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి రాత్రి దాక వేదపండితుల ఆధ్వర్యంలో విశేష పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు సెల్‌నం 99490 58654 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

కోళ్ల పరిశ్రమతో దుర్వాసన

పెబ్బేరు రూరల్: మండలంలోని కంచిరావుపల్లి శివారులో ఉన్న ఓ కోళ్ల ఫాంను గురువారం బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగేంధర్‌గౌడ్ సందర్శించారు. కోళ్ల ఫాం నుంచి అధికంగా దుర్వాసన వస్తుందని, దాని వలన ప్రజలు, ముఖ్యంగా పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారని గ్రామస్థులు వాపోతున్నారని ఆయన అన్నారు. ఈ మేరకు కోళ్ల ఫాం వద్దకు రాచాల వెళ్లగా ఫాం సిబ్బంది లోపలికి అనుమతించలేదని ఆయన తెలిపారు. అనంతరం ఆయన అక్కడే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పౌల్ట్రీ ఫాం నిర్మాణంలో కొంత మేర అసన్మెంట్ భూమిని ఆక్రమించిన ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ చొరవ తీసుకొని పౌల్ట్రీ ఫాంను మూసివేయడానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. లేకపోతే స్థానికులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్యయాదవ్, నాయకులు వీవీ గౌడ్, అంజిసాగర్, గ్రామస్తులు ఎల్లారెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



ఆత్మకూర్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి

ఆత్మకూర్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. బాలకిష్టాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం రాత్రి 8 గంటలకు ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వంట సామగ్రి తనిఖీ చేసి బాలికల యొక్క సమస్యలను తెలుసుకొని, వారితో కలిసి భోజనం చేశారు. బాగా చదవాలని జీవితంలో ఉన్నత స్థితిలోకి రావాలని సూచించారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా బోధన

పాన్‌గల్: విద్యార్థులకు ప్రాథమిక దశలోనే విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని అందుకు అనుగుణంగా బోధన చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని దొండాయిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందిస్తూ పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి నిత్యం హెచ్‌ఎంలు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలని సూచించారు. అనంతరం మాందాపూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సాంఘిక శాస్త్రం కాంప్లెక్స్ సమావేశాన్ని సందర్శించి సబ్జెక్టుపై పలు సూచనలు, సలహాలు అందించారు.

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, పాఠశాలలోని మధ్యాహ్నం, హాస్టల్స్, గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కొత్తకోట ఎంపీడీఓ చెన్నమ్మ ఆదేశించారు. గురువారం మండలంలోని అమడబాకుల సమీపంలో గల మైనార్టీ గురుకుల పాఠశాలను ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పాఠశాలలోని స్టోర్ రూం తనిఖీ చేయడంతో పాటు విద్యార్థుల కోసం వండిన అన్నం, కూరలను పరిశీలించారు. ప్రతి రోజు విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను ప్రిన్సిపాల్ శిరీషను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సామర్థ్యాలు పెంపొందించాలి

ఖిల్లాఘనపురం: విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాల, తిర్మలాయపల్లి, మొగిలికుంటతండా, కమాలోద్దీన్‌పూర్ పాఠశాలలను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో చదివించి వారి సామర్థ్యాలు, చేతి రాతను పరిశీలించారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారు ఉత్సాహం చూపుతున్న విషయాల ద్వారానే చదువుపై ఇష్టం పెంచేలా చూడాలన్నారు.



తిర్మలాయపల్లిలో..



కొత్తకోట మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎంపీడీఓ చెన్నమ్మ



దొండాయిపల్లి పీఎస్‌లో విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

వీపనగండ్ల: మండలంలోని తూంకుంటలో నిర్మించనున్న 33/11 సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం గురువారం అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి స్థలం పరిశీలించారు. గతంలో గ్రామానికి సబ్‌స్టేషన్ మంజూరు అయిన స్థల వివాదం వల్ల నిర్మాణం జరగలేదని, గ్రామస్తులు సమన్వయంతో వ్యవహరించి సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని చూపించాలని అధికారులు కోరారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని కాంగ్రెస్ నాయకులు రాజగోపాల్, రాంబాబు, తిరుపతయ్య, బలుసు రాముడు, చిన్నరాంబాబు, మౌలాలి అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కురుమూర్తి, సర్వేయర్ శివ పాల్గొన్నారు.

రైతు డిమాండ్ డే నిర్వహించాలి



అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వనపర్తి రూరల్: ఇండియా రైతు డిమాండ్ డేను జనవరి 9న నిర్వహించాలంటూ ఏఐయూకేఎస్ (అఖిల భారత ఐక్యరైతు సంఘం) జాతీయ కమిటీ పిలుపు మేరకు గురువారం జిల్లాకేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రాజన్న ఆధ్వర్యంలో నాయకులు గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, టీయూసీఐ జిల్లా కోశాధికారి రాజు, జిల్లా నాయకుడు గణేష్ పాల్గొని మాట్లాడారు. బీజేపీ 2014 ఎన్నికల ప్రచారంలో భాగంగా రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిటీ సిఫారస్ మేరకు మద్దతు ధర రైతు పెట్టుబడిపై 50 శాతం కలిపి నిర్ణయిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చినా నేటికీ అమలు చేయకపోగా రైతుల నడ్డి విరిచేలా మూడు కార్పొరేట్ చట్టాలను తీసుకొచ్చిందని ఆరోపించారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, చింతలన్న, నర్సింహ, ఆశన్న, నాగేశ్, చెన్నయ్య, స్వామి, రాము, వెంకటన్న, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

కొత్తకోట: వెల్ఫేర్ బోర్డులోని సెస్ నిధులను కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కనిమెట్టలో భవన కార్మికుల సమావేశం ఏర్పాటు చేసి కార్మికులతో సభ్యత్వ నమోదు చేశారు. అనంతరం బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ కొత్తకోట భవన, ఇతర నిర్మాణ కార్మికులకు వెల్ఫేరు బోర్డులోని నిధులను వారి సంక్షేమం కోసమే వినియోగించాలన్నారు. అదేవిధంగా నిర్మాణ కార్మికుడికి ప్రమాదానికి ఇస్తున్న బీమా రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దుర్గా భవాని తాపి కార్మిక సంఘం అధ్యక్షుడు ఆకుల రమేష్, ఉపాధ్యక్షులు రాజు, కోశాధికారి వెంకటేష్, మాజీ అధ్యక్షులు రామచంద్రయ్య, నాయకులు జి.మన్యంకొండ, మల్లేష్, మన్యంకొండ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పాన్‌గల్‌లో పోటీలు ప్రారంభిస్తున్న నెహ్రూ యువ కేంద్రం సభ్యులు, అధ్యాపక బృందం



వెంకటాంపల్లిలో..

ఖిల్లాఘనపురం: క్రీడలు యువతలో మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని బీజేపి జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ అన్నారు. గురువారం మండలంలోని వెంకటాంపల్లిలో మాజీ ప్రధాని అటల్‌బీహారి వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బీజేపీ నాయకుడు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడు, వెంకటాంపల్లి నాయకులు సురేందర్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవినాయక్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఖలీల్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్, శివశంకర్, సత్యనారాయణ, వెంకటరమణ, హేమంత్, భరత్ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం స్టేడియం గ్రౌండ్‌లో..

మండల కేంద్రంలోని స్టేడియం గ్రౌండ్‌లో గురువారం రోడ్డుమీదితండా యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. తండాకు చెందిన పెద్దలు నానునాయక్, బాలునాయక్, గోవిందునాయక్ పోటీలను ప్రారంభించినట్లు యువకులు లాలు, నెహ్రూ, తులసీరాం, రాజునాయక్, వెంకటేష్ తెలిపారు.

పర్వతాపురంలో..

మండలంలోని పర్వతాపురంలో గ్రామ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో రాఘవేందర్, గణేష్, శివకుమార్, శివ, సుదర్శనాచారి, సంజీవరెడ్డి, రామకృష్ణారెడ్డి, మల్లారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బాలయ్య, సుబ్బారాజు పాల్గొన్నారు.

పాన్‌గల్: క్రీడలు మానసికోల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని మాజీ జెడ్పీటీసీ రవి కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రాముయాదవ్, పుల్లారావు అన్నారు. గురువారం మండలంలోని దొండాయిపల్లిలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను వారు ప్రారంభించారు. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 30 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, రమేష్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో..

పాన్‌గల్: మండల కేంద్రలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నెహ్రూ యువ కేంద్రం, మేరా యువ భారత్ ఆధ్వర్యంలో గురువారం బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించినట్లు కళాశాల అధ్యాపక బృందం తెలిపారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, షార్ట్‌పుట్ తదితర క్రీడలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

నేడు పండుగ సాయన్న విగ్రహావిష్కరణ

పాన్‌గల్: మండలంలోని రాయినిపల్లిలో శుక్రవారం తెలంగాణ ప్రజా వీరుడు పండుగ సాయన్న విగ్రహ ఆవిష్కరణకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి హాజరవుతున్నట్లు గ్రామ విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముదిరాజ్ సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

సీపీఎం నాయకుల అరెస్ట్

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటనలో భాగంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులును పోలీసులు అరెస్టు చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ అరెస్టును సీపీఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఆయన అన్నారు. ప్రభుత్వాలు ప్రజా, కార్మిక సమస్యలు పరిష్కరించినప్పుడు ఎవరిని ఎవరూ అరెస్టు చేయాల్సిన అవసరం లేదన్నారు. డిప్యూటీ సీఎం పర్యటన అనంతరం ఆయనను విడుదల చేశారు.

ఆర్టీసీ బస్సు వద్ద మహిళల గొడవ

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద కొందరు మహిళలు చీపుర్లు, కర్రలతో ఒకరినొకరు కొట్టుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్ నుంచి వనపర్తికి వెళ్తున్న ఆర్‌టీసీ బస్సు వద్ద ఖిల్లాఘనపురంతో పాటు ఓ గిరిజన తండాకు చెందిన మహిళ మధ్య గొడవ చోటు చేసుకుంది. తరువాత గొడవ పెద్దది కావడంతో కొందరు మహిళలు గుంపుగా చేరి చిన్నపాటి కర్రలు, చీపుర్లతో కొట్టుకున్నారు. చివరకు అక్కడే ఉన్న కొందరు కలుగజేసుకుని వారిని పక్కకు జరపడంతో గొడవ సద్దుమనిగింది. ఈ వీడియోను కొందరు వ్యక్తులు ఉచిత బస్సు ఎఫెక్ట్ అంటూ క్యాప్షన్లు పెడుతూ సోషల్ మీడియాలో షేరు చేస్తున్నారు.

డబ్బులు ఇప్పించండి

వనపర్తి టౌన్: చేసిన పనులకు చెక్కులు ఇప్పించండంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మున్సిపల్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. స్థానిక మున్సిపాలిటీలో ఎస్‌డీఎఫ్ టీఎఫ్ఐడీయూసీ కింద చేపట్టిన అభివృద్ధి పనుల చెక్కులు అధికారులు జారీ చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు ఎర్ర శ్రీను, నీలవర్ధన్‌రెడ్డి, లోకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టాల సాధనకు పాదయాత్ర

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ తండా శివారుతో పాటుగా పలు తండాలకు చెందిన రైతులు కాస్తు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రాలోని ఆర్‌డీఓ కార్యాలయానికి పాదయాత్ర చేపడతామని భూ పట్టాల సాధన కమిటీ కన్వీనర్ సక్రునాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అంజనేయులు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్యానాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర చేపడుతామన్నారు. ఈ పాదయాత్రలో గిరిజనులతో పాటుగా మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, వెనికితండా, ముందలితండా, ఆముదంబండతండా, చిన్న పీర్‌తండా, కర్నెతండా, మిట్యాతండా లకు చెందిన మాజీ సర్పంచులు పాల్గొంటారని వారు చెప్పారు. మూడు తరాలుగా గిరిజనులు సాగు చేస్తున్న సుమారు 463 ఎకరాల భూములకు పట్టాలు సాధించే వరకు ఉద్యమాలు చేపడతామన్నారు.

ప్రాథమిక పాఠశాలలో కిచెన్ గార్డెన్



పాఠశాల పెరటితోటలో విద్యార్థులతో కలిసి ఆకుకూరలు తెంచుతున్న హెచ్‌ఎం

పాన్‌గల్: మండలంలోని మాధరావుపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో పెరటి తోట(కిచెన్ గార్డెన్)లో పలు రకాల కూరగాయలు, ఆకుకూరలను పెంచుతున్నారు. పాఠశాల హెచ్‌ఎం వీరస్వామి పర్యవేక్షణలో పాఠశాల ఆవరణలోని పెరటితోటలో పాలకూర, చుక్కకూర, మెంతికూర, గోంగూర, తోటకూర, కోతిమీరతో పాటు టమాట, వంకాయ, చిక్కుడుకాయ, బెండకాయ వంటి తోటల ద్వారా వచ్చే తాజా ఆకుకూరలు, కూరగాయలు మధ్యాహ్న భోజనానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని హెచ్‌ఎం పేర్కొన్నారు. పెరటి తోటకు నీరు పెట్టడం, పిచ్చిమొక్కలు (కలుపు) తొలగించే విధానం విద్యార్థులకు తెలియపర్చడంతో వాటిని ఎంతగానో జాగ్రత్తగా పోషణ చేస్తున్నారని హెచ్‌ఎం తెలిపారు. పాఠశాల ఆవరణలో పెంచిన పెరటి తోట మిగతా పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయోగాత్మక బోధనతో ప్రయోజనం



జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సహచరులు

వీపనగండ్ల: విద్యార్థులకు ప్రయోగాల రూపంగా విద్యను బోధించడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని మండల విద్యాధికారి నర్సింహులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జీవశాస్త్ర సబ్జెక్ట్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రయోగ పరికరాలను ప్రదర్శిస్తూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించడం వల్ల సైన్స్‌పై మక్కువ పెరుగుతుందన్నారు. విద్యా నిబంధనలు అనుసరించి తెలంగాణ ఎడ్యుకేషనల్ యాప్‌లో వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇటీవలే జూనియర్ లెక్చరర్‌గా ఎంపికైన మాందాపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మల్లయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీబీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్‌కుమార్, జీహెచ్‌ఎం భానుప్రకాష్, సీఆర్‌పీ వెంకటేశ్, వివిధ పాఠశాలల జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పొమ్మంది.. '108' ప్రాణం పోసింది



బిడ్డను చూపుతున్న 108 సిబ్బంది

అధ్వానం ఆత్మకూర్ ఆస్పత్రి

ఆత్మకూర్: ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది ఉన్నా ప్రసవం చేయకుండా మరో ఆస్పత్రికి రెఫర్ చేస్తే.. వైద్యులు చేయలేని పనిని ఆంబులెన్సు సిబ్బంది చేసి చూపించారు. అంబులెన్స్‌లోనే సాధారణ ప్రసవం చేసి తల్లీబిడ్డను క్షేమంగా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఆత్మకూర్ మండలంలోని మేడేపల్లికి చెందిన నాగలక్ష్మి పురిటి నొప్పులతో గురువారం మధ్యాహ్నం 3:15 గంటలకు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వచ్చారు. ఇక్కడి వైద్యులు, ఏఎన్‌ఎంలు నాగలక్ష్మి పరిస్థితి విషమంగా ఉందని వెంటనే మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో చేసేదేం లేక 108 అంబులెన్స్‌లో నాగలక్ష్మిని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. మన్యంకొండ సమీపంలో నాగలక్ష్మికి పురిటి నొప్పులు అధికం కావడంతో సాయంత్రం 5 గంటల సమయంలో ఆంబులెన్స్ ఈఎంటీ రామలింగం, పైలెట్ ఫరీద్ స్పందించి ఆశావర్కర్ సహకారంతో సాధారణ ప్రసవం చేశారు. నాగలక్ష్మికి నాలుగో కాన్పు కాగా ఆడ బిడ్డకు జన్మనిచ్చిందని, ప్రస్తుతం మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో తల్లి, కూతురు క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు. ఒకప్పుడు సాధారణ, సిజేరియన్ ప్రసవాలు చేయడంలో ఆత్మకూర్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉండేదని, ప్రస్తుతం బస్తీ దవాఖాన కంటే అధ్వానంగా మారిందని స్థానికులు మండిపడుతున్నారు. జిల్లా ఆస్పత్రి తర్వాత రెండో ఆస్పత్రిగా చెప్పుకునే ఆత్మకూర్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో వైద్యులు, సిబ్బంది లేక ఆపదలో వచ్చే రోగులకు, గర్భిణులకు వైద్యం చేయకుండానే పెద్దాస్పత్రులకు రెఫర్‌లు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కలెక్టరు ఆదర్శ్ సురభి, వైద్యాధికారులు స్పందించి వైద్యులను, సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న భవానీ

వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ రెడ్ క్లబ్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై కళాశాల ప్రిన్సిపాల్ బి.ఈశ్వరయ్య అధ్యక్షతన అవగాహన కల్పించారు. కార్యక్రమానికి తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ రిసోర్స్ పర్సన్ భవానీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. తాను హెచ్ఐవీ పాజిటివ్ కలిగి ఉన్న వారికే పుట్టానన్నారు. తల్లిదండ్రులను కోల్పోయి చిన్నతనం నుంచే హెచ్ఐవీతో బాధపడుతూ మనోధైర్యంతో మానసికంగా ఎదుర్కొన్న అనేక అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఎయిడ్స్ సోకిన వ్యక్తులతో కలిసి జీవించినా.. తిన్న వారితో స్నేహం చేసిన ఎయిడ్స్ సోకదని, వారిని సంఘ విద్రోహులు గానో, అంటరాని వారిగాను చూడకూడదన్నారు. విద్యార్థినులు, మహిళలు ఎంతో జాగ్రత్తతో ఉండాలని, శ్రేష్ఠమైన జీవితాన్ని క్షణకాలం కోసం బలి చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రామరాజుయాదవ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పోతురాజు శ్రీనివాస్, రూపరాణి, సుష్మ, లెక్చరర్లు, విదార్థినులు తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి: బీజేపీ



కుమార్‌కు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎస్‌వీఎస్ఎస్ ప్రభాకర్

వనపర్తి టౌన్: అధికార కాంగ్రెస్ పార్టీలో నాయకులు, కార్యకర్తలు ఇమడలేకపోతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీజేపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన కుమార్ గురువారం తిరిగి బీజేపీలో చేరారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎస్ ప్రభాకర్ బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సమన్వయం, సఖ్యత లేక చాలా మంది నాయకులు, కార్యకర్తలు నిరుత్సాహంలో ఉన్నారని, వారందరూ ఒక్కొక్కరిగా బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ కంటే బీజేపీ పై చేయి సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లోక్‌నాథ్‌రెడ్డి, శ్రీశైలం, సీతారాములు, పురుషోత్తంరెడ్డి, కుమారస్వామి, చిత్తారి ప్రభాకర్, సుబ్రమణ్యం, బాబురావు, పెద్దరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిపై కసరత్తు...

వనపర్తి జిల్లా అధ్యక్ష పదవిపై కసరత్తు మొదలైంది. ఈ మేరకు గురువారం రాత్రి ఎస్‌వీఎస్ఎస్ ప్రభాకర్ నేతృత్వంలో సమావేశమయ్యారు. ప్రస్తుత అధ్యక్షుడితో పాటు పోటీలో ఉన్న లోక్‌నాథ్ రెడ్డి, చిత్తారి ప్రభాకర్, సీతారాములు, కుమారస్వామి, శ్రీశైలం తదితరులతో పాటుగా కోర్ కమిటీ సభ్యులతో ప్రభాకర్ అభిప్రాయ సేకరణ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అందరి ఆమోదానికి అనుగుణంగా జిల్లా అధ్యక్ష ఎంపిక ఉంటుందని వెల్లడించారు.

విత్తనం వెదజల్లే పద్ధతితో అధిక లాభాలు



ధర్మాపురంలో విత్తనం వెదజల్లిన వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ, రైతులు

అమరచింత: వరిసాగులో విత్తనం వెదజల్లే పద్ధతి ద్వారా పంట పెట్టుబడి తగ్గించుకోవడంతో పాటు కూలీల కొరతను అధిగమించొచ్చని ఏఓ అరవింద్ సూచించారు. మండలంలోని ధర్మాపురం గ్రామంలో 8 మంది రైతులు 20 ఎకరాల్లో విత్తనం వెదజల్లే పద్ధతి ద్వార వరి సాగు చేయడంతో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా రైతులకు విత్తనం వెదజల్లే పద్ధతిపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఎకరానికి 10–15 కేజీల విత్తనం సరిపోతుందని, నారు పెంచే పని ఉండదన్నారు. దీంతో పంటకాలం 10 నుంచి 15 రోజులు తగ్గుతుందని, యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి 3 క్వింటాళ్ల మేర పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ హరిత, రైతులు పాల్గొన్నారు.